జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 8-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 531 పేజీలు: 4 వెల : రూ.7



## శ్రీకాకుళం.. ఆమదాలవలస రోడ్డులో నిత్యం..

* ఇంకా పూర్తి కాని కల్వర్టులు, డివైడర్లు
* ఉదయం, సాయంత్రం వేళ బారులు దీరుతున్న వాహనాలు
* బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిపేసిన కాంట్రాక్టర్
* ఇంకా హామీలకే పరిమితమవుతున్న రెండు నియోజకవర్గాల నేతలు
* ఈ రోడ్డులో నిత్యం ప్రమాదాలు
* అసహనం వ్యక్తం చేస్తున్న వాహనచోదకులు
* నాడు వైసీపీ ప్రభుత్వంపై.. నేడు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న ప్రజలు
* చొరవ తీసుకోని నేతలు, జిల్లా యంత్రాంగం

# నరకయాతన

**శ్రీకాకుళం, డిసెంబర్ 7 (వార్త):** శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డులోని కొత్తరోడ్డు వద్ద ఉన్న కల్వర్టు నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. దీంతో ఈ కల్వర్టు వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం వేళ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ కల్వర్టు వద్ద వాహనాలు పెద్ద ఎత్తున వాహనాలు బారులు దీరుతున్నాయి. పాపం.. పోలీసులు అక్కడే ఉండి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నా.. వాహనచోదకులు వేగంగా వెళ్లిపోవాలన్న ఆతృత కారణంగా ట్రాఫిక్ జాం అవుతోంది. శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఈ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి కూటమి ప్రభుత్వం వరకూ ఈ రోడ్డుపై ఎందుకో చులకనభావం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఈ రోడ్డుపై ఏకంగా ఆమదాలవలసలో జరిగిన రోడ్‌షోలో చంద్రబాబు సైతం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, గొండు శంకర్, కూన రవికుమార్.. ఇలా నాయకులంతా ఊకదంపుడు ప్రసంగాలు కూడా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఆమదాలవలస ఎమ్మెల్యేగా ఉన్న తమ్మినేని సీతారాం కూడా పెద్దగా ఈ రోడ్డు నిర్మాణంపై పట్టించుకోలేదు. దీంతో ఆయనపై ప్రజలు నిత్యం రుసరుసలాడేవారు. శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఉన్న ధర్మాన ప్రసాదరావు సైతం రాగోలులో జరిగిన సమావేశంలో ఈ రోడ్డు విషయంలో కొందరు అడిగిన ప్రశ్నకు వ్యంగ్యంగా మాట్లాడిన తీరు ఇప్పటికీ అందరికీ గుర్తు ఉండే ఉంటుంది. దీనిపై ఆయనపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ రోడ్డులో ప్రయాణమంటే ప్రయాణికులు హడలిపోయేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక దృష్టిసారించి రహదారి నిర్మాణాన్ని చాలావరకు పూర్తి చేయించారు. అయితే ఈ రహదారిలో కల్వర్టుల వద్ద వంతెన నిర్మాణాలు చేపట్టకలేదు. బిల్లులు అవ్వకపోవడంతోనే కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మాణం చేపట్టలేదన్న వాదన కూడా ఉంది. అలాగే రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం కూడా అరకొరగానే ఉంది. కొంతమేర ఏర్పాటు చేసిన డివైడర్ మధ్యలో తుప్పలు పెరిగిపోయాయి. ఈ పనులు చివరి దశలో నిలిచిపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇకనైనా శ్రీకాకుళం, ఆమదాలవలస ఎమ్మెల్యేలు స్పందించి పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు.



## రోడ్డు ప్రమాదాల్లో.. ముగ్గురికి గాయాలు

**పలాస, డిసెంబర్7 (వార్త):** పలాస మండలం శాసనాం గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి లారీ ముందు టైరు లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లా అంతరసింగి గ్రామానికి చెందిన కె.ఈశ్వరరావు (19)కు తీవ్ర గాయాలు కాగా, సునీల్ కుమార్ (19) స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రెండు వాహనాలు ఢీ

**మందస, డిసెంబరు 7(వార్త):** మందస మండలంలోని గొప్పిలి-సందూరు గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కోదుకొలిగాం గ్రామానికి చెందిన మురళీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. పర్లాకిమిండి నుంచి మందస వైపు వస్తున్న బొలేరో వాహనం, మందస నుంచి గొప్పిలి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మెళియాపుట్టి మండలం కోదుకొలిగాం గ్రామానికి చెందిన మురళీకృష్ణకు ఎడమకాలు విరిగిపోగా, తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సు సమాచారం అందడంలో హుటాహుటిన సిబ్బంది చేరుకుని, క్షతగాత్రుని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.







## కొండపేటలో వరికుప్పలు దగ్ధం .. బాధితులకు ఎమ్మెల్యే కూన పరామర్శ

**బూర్జ, డిసెంబరు 7(వార్త):** పెద్దపేట పంచాయతీ పరిధిలోని కొండపేటలో రైతులు మజ్జి సూర్యనారాయణ, పాలక వరాలమ్మకు చెందిన వరికుప్పలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి కాల్చివేశారు. ఈ ఘటనతో రైతు కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న శాసన సభ్యుడు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ వెంటనే గ్రామానికి చేరుకుని ఆ రైతు కుటుంబాన్ని పరామర్శించారు. నష్టాన్ని అంచనా వేసి, అవసరమైన సహాయం అందించాలని అధికారులకు ఆదేశించారు. రైతుల భద్రత కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో జరిగిన ఈ ఘటనపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## ఆదిత్యుడికి విరాళాలు



**శ్రీకాకుళం, డిసెంబరు 7(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామి వారికి ఆదివారం శ్రీకాకుళం వాస్తవ్యులు ఆకుల మహేశ్వర రావు సుమారు రూ.1,00,000లు విలువ గల స్టీల్ బెంచులు 10సెట్లు, మద్రపు వెంకట నాయుడు, సత్యదేవి రూ.20,000లు విలువ గల రెండు స్టీల్ బెంచి సెట్లు ద్వారపు అజిత్‌కుమార్, అనురాధ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధి కారికి ప్రసాద్‌కి అందజేశారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వ దించారు. స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

## సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి



**పలాస, డిసెంబరు 7 (వార్త):** సమాజంలో పెరిగిపోతున్న సైబర్ క్రైమ్‌పై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం రాత్రి కిష్టుపురంలో కాశీబుగ్గ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై బారిన పడకుండా ఐదు ముఖ్యమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలపై (క్రైమ్ ఎగానిస్ట్ ఉమెన్) శారీరక, లైంగిక, మానసిక హింసల రూపాల్లో జరిగే చట్టవిరుద్ధ చర్యలు వారి జీవితాలను ప్రభావితం చేస్తాయన్నారు. డొమెస్టిక్ అబ్యూస్, రేప్, దోపిడీ మరణాలు, అమ్మడం, కిడ్నాపింగ్ వంటి రకాలుగా సాధారణం అన్నారు. ఈ నేరాలు మహిళలకు మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు, భయం, ప్రతీకార భీతి కలిగిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బూర్ల కృష్ణంరాజు, ఢిల్లీ, తులసి, నారీశక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

## ఆదిత్యుని ఆదాయం రూ.8.77లక్షలు



**శ్రీకాకుళం, డిసెంబరు 7(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామి వారికి టికెట్లు రూపేణా రూ.5,57,100లు, పూజలు, విరాళాల రూపంలో రూ.50,925లు, ప్రసాదాల రూపంలో రూ.2,69,480ల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 5516 మంది హాజరు

**శ్రీకాకుళం, డిసెంబరు 7(వార్త):** జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన జాతీయ ఉపకార వేతన ప్రతిభ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మొత్తం 25 కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 5,617 మంది విద్యార్థులకు గాను 5,516 మంది హాజరు కాగా, 101 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

## అయ్యప్ప భక్తులకు అండగా నారాయణరావు



**సోంపేట, డిసెంబరు 7(వార్త):** సోంపేటలోని అయ్యప్ప భక్తులకు సోంపేట శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షులు రెల్ల నారాయణరావు అండగా నిలిచారు. మొగలి కొత్తూరు శివాలయం వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన వంటశాలను పూర్తి చేయాలని స్థానిక అయ్యప్ప భక్తులు నారాయణరావును కోరిన వెంటనే అందుకు అంగీకరించారు. ఈ మేరకు వీలైనంత త్వరగా వంటగది నిర్మాణం పూర్తి చేసి అప్పగిస్తానని హామీ ఇవ్వడంతో అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## రైల్వే ఉద్యోగి 'రమేష్' ఔదార్యం



**మందస, డిసెంబరు 7(వార్త):** ఆ నలుగురు ట్రస్టు ద్వారా దాతలు రక్తదానం కొనసాగిస్తున్నారు. విజయ నగరం జిల్లాకు చెందిన రమేష్ అనే రైల్వే ఉద్యోగి రక్తదానం చేసి, మానవత్వం చాటుకున్నారు. ఆ నలుగురు ట్రస్టు ద్వారా అనంతపురంలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు వెళ్లి, తన రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఆ నలుగురు ట్రస్టు ప్రతినిధులు రమేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# ఆధ్యాత్మికతతో మార్మోగిన మందస

- -భక్తి, శ్రద్ధలతో 108 కుండముల గాయత్రీ మహా జ్ఞాన యజ్ఞం
- -సామూహిక గాయత్రీ జపాన్ని పఠించిన భక్తులు
- -భారీగా భక్తులకు అన్న ప్రసాద వితరణ
- -యజ్ఞానికి హాజరైన నాయకులు, అధికారులు
- -వైభవంగా మూడు రోజుల పాటు గాయత్రీ పరివార్ ట్రస్ట్ కార్యక్రమాలు

**మందస, డిసెంబరు 7(వార్త):** గాయత్రి మంత్ర జపంతో మందస పులకించింది. వేదమంత్రాల మధ్య జరిగిన యజ్ఞంలో భక్తులు పాల్గొన్నారు. ఓ వైపు యజ్ఞాలు.. మరో వైపు వేద మంత్రాల పఠనంతో మందసలో ఆధ్యాత్మికత చోటు చేసుకుంది. రాజకీయ నాయకులు, అధికారులు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులతో మందసలో ఆధ్యాత్మికత వాతావరణం ఏర్పడింది. నిర్వాహకుల సమన్వయంతో 108 కుండముల గాయత్రీ జ్ఞాన యజ్ఞం ఫలవంతం చేశారు. అధికారులు కూడా భక్తులుగా మారి.. ఆధ్యాత్మికతలో పాలుపంచుకున్నారు. నెల రోజులు నిర్వాహకులు పడుతున్న శ్రమ నేటితో పూర్తయింది. ఎక్కడా ఎటువంటి లోటు రానివ్వకుండా నిర్వాహకులు చక్కగా ఏర్పాట్లు చేసి, భళా.. అనిపించుకున్నారు. ఈ నెల 5న ప్రారంభమైన కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రులు గౌతు శ్యామసుందర శివాజీ, డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మందసలోని శ్రీమన్నారాయణ వెంచర్‌లో యాగశాలను ఏర్పాటు చేశారు.

హరిద్వార్ శాంతికుంజ్ ఆధ్వర్యంలో ఈ నెల 5న సాయంత్రం మూడు గంటలకు మందస శివార్లో గల గోపాలసాగరం నుంచి యజ్ఞస్థలం వరకు 251 కలశాలతో కలశయాత్ర, ఆరు గంటలకు 1008 దీపాలతో దీపామహ యజ్ఞం, ఆరున ఉదయం 9గంటలకు గాయత్రి తీర్థ శాంతికుంజ్(హరిద్వార్) తత్వాధాన్ పండితులతో 108 కుండములతో గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం, దేవపూజనం, సర్వతోభద్ర వేదిక పూజనం నిర్వ హించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్ర మాలు, ఏడున ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు సామూహిక గాయత్రీ జపం, 9గంటలకు గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం, పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ జరిగింది. వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు ఈ యజ్ఞంలో పాల్గొన్నారు. మందసలోని పలువురు పెద్దలు, నాయకులు, సోషల్ వర్కర్లు, యువకులు తారతమ్య బేధం లేకుండా సేవలందించారు.







## ఆదిత్యుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



**శ్రీకాకుళం, డిసెంబరు 7(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని ఆదివారం ఉదయం హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హరి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ కార్యనిర్వాహణా ధికారి ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు.

ఆలయ అర్చకులు, వేద పండి తులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వీరికి స్వామి వారి ప్రసాదా లను, చిత్రపటాన్ని అందజేశారు.

## కొరికాన పేదలకు దుప్పట్లు వితరణ



**పలాస, డిసెంబరు 7(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల 31 వార్డు ఇంచార్జి కొరికాన శంకరరావు స్థానికగా ఉన్న పేదలకు తన సొంత ఖర్చుతో దుప్పట్లు, పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు పేదలకు ఈ చలికాలంలో దుప్పట్లు పంచే బృహత్కర కార్యక్రమం శంకరరావు చేపట్టారన్నారు.

ఆయనకు ప్రజలపై ఉన్న సేవాభావం, ఉదారతను తెలియజేస్తుందని అన్నారు. పేదలకు సుమారు 300 మందికి పైగా దుప్పట్లు పంచిపెట్టిన కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో వారితోపాటు ఆ వార్డు పరిధిలో ఉన్న జనసేన నాయకులు ప్రశాంత్, కిషోర్, అక్కడ యువత పేద ప్రజలు పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణ



**పలాస, డిసెంబరు 7(వార్త):** వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి పిలువు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైస్సార్సీపీ ప్రజా ఉద్యమం, రచ్చబండ ద్వారా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, 19వ వార్డు, సూదికొండ గ్రామం, అంబేద్కర్ నగర్‌లో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, స్టేట్ వైస్సార్సీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సంతకాలు చేశారు. కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, బగాది సింహాచలం, దుమ్ము రాజు, దేవాది బుడ్డు తదితరులు పాల్గొన్నారు.

## అనధికార మద్యం విక్రయాలపై కఠిన చర్యలు



**సోంపేట, డిసెంబరు 7(వార్త):** సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అనధికారికంగా మద్యం విక్రయాలు జరిపితే అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సోంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. దాబా హోటళ్లలో కూడా మద్యం సేవించడానికి ఏమాత్రం అవకాశం లేదని పేర్కొన్నారు. ఆదివారం జరిపిన సోదాల్లో కొర్లంలో పుణ్యవతి నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు బెల్ట్ షాపులు నిర్వహించిన వారిపై 45 కేసులు నమోదు చేసి సుమారు 83 లీటర్ల మద్యాన్ని చేసినట్లు సీఐ తెలిపారు. గతంలో అనధికారికంగా మద్యం దుకాణాలు నిర్వహించిన వారిని తహ సీల్దార్ ఎదుట హాజరు పరిచి 63 మందిపై బైండోవర్ చేశామన్నారు. అటువంటి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. అనధికార మద్యం విక్రయిస్తే 14405 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## అంపురం - ఘాటి రోడ్డుకు మరమ్మతులు

**సోంపేట, డిసెంబరు 7(వార్త):** కంచిలి మండలం అంపురం - ఘాటి రోడ్డు అనేక చోట్ల గోతులమయమై రాళ్లు తేలి వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో మండల టీడీపీ నాయకులు ఆర్అండ్‌బీ శాఖ ఇంజనీర్లపై ఒత్తిడి చేసి ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇదే రోడ్డు కొత్తగా నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు ఆలస్యం కావడంతో తాత్కాలికంగా ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభిస్తున్నట్లు మండల టీడీపీ యువ నేత మాదిన ప్రదీప్ తెలిపారు. ఈ పనులను ఆదివారం టీడీపీ నేతలు పరిశీలించారు. ప్యాచ్ వర్క్ పనులు చక్కగా పూర్తయితే ఈ రహదారిపై ప్రయాణాలకు సౌలభ్యంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం ప్రధాని మోదీ ధ్యేయం



**జి.సిగడాం, డిసెంబరు 7(వార్త):** దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని, ఎచ్చెర్ల నియోజక వర్గ ప్రజల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పనిచేస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘు రాం తెలిపారు. ఆదివారం ఆయన ఆనందపురం గ్రామంలో విలేఖర్లుతో మాట్లాడారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఐదు లక్షల బీమా పేదవారికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మహిళలకు వన్‌స్టాప్ సెంటర్‌లు, స్వచ్ఛత అభియాన్ పథకం కింద ఉచిత గ్యాస్ వంటి పథకాలు అమలుచేస్తున్నట్టు తెలి పారు. దేశం అభివృద్ధి చెందాలంటే కుటుంబ పాలనకు స్వస్తి పలకా లనే నరేంద్ర మోదీ నిర్ణయం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆయన తెలిపారు.

# ఘనంగా ఎమ్మెల్యే బగ్గు జన్మదిన వేడుకలు

-నరసన్నపేటలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కటింగ్

-ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

-భారీ ఎత్తున పాల్గొన్న పార్టీ నేతలు, కార్యకర్తలు




**నరసన్నపేట, డిసెంబరు 7(వార్త):** నరసన్నపేటలో శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి జన్మదిన వేడుకలు ఆదివారం పార్టీ శ్రేణులు, అభిమానుల ఆధ్వ ర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ ఈ వేడుకలకు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై తమ నాయకుడికి శు భాకాంక్షలు తెలియజేశారు. వేడుకల ప్రారంభంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు



స్వర్గీయ నందమూరి తారకరామారావు, మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ కింజ రాపు యర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణుల సమక్షంలో కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల కిట్లను పంపిణీ చేశారు. ఆసుపత్రికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న అభి వృద్ధి చర్యలను నాయకులు వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, రాష్ట్ర పొందర కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ నరసింహులు, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరావు, మండల అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, బగ్గు గోవిందరావు, బైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు, శిమ్మ చంద్ర శేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, రావాడ గణపతి రావు, బలగ ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ హెూదాలో ఉన్న సభ్యులు, మహిళా సోదరీమణులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధికి ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన నాయకుడి జన్మదిన వేడుకలు పండుగ వాతావరణంలో ముగిశాయి.

## చల్లవానిపేటలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



**జలుమూరు, డిసెంబరు 7(వార్త):** చల్లవానిపేటలో పోలీసులు డాగ్ స్క్వాడ్ సహా యంతో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఒడిశా నుంచి గంజాయి రవాణా పెరుగుతున్న దృష్ట్యా, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ముమ్మర సోదాలు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. గ్రామంలోకి ప్రవేశించే మార్గాలు, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వ హించారు. ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలు, గంజాయి రవాణా సంబంధిత సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అవాం ఛిత కార్యకలాపాలను అరికట్టేందుకు తనిఖీలు మరింత కఠినతరం చేస్తామని, ప్రజల సహకారంతో అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో నియంత్రణ సాధించగలమని అధికా రులు తెలిపారు.

## శక్తి యాప్ మహిళల భద్రతకు రక్షణ కవచం




**నరసన్నపేట, డిసెంబరు 7(వార్త):** మడపాం టోల్ ప్లాజా వద్ద మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆదివారం 'శక్తి యాప్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీం ఇన్‌చార్జ్ గిరిధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది, వాహన డ్రైవర్లకు యాప్ వినియోగంపై పూర్తి వివరాలు అందించారు. అనుకోని ప్రమాదాలు, వేధింపులు లేదా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీస్ సహాయం కోరేందుకు శక్తి యాప్ ఎంతో సమర్ధవంతంగా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. యాప్ ద్వారా సమాచారం అందిన వెంటనే, అత్యధికంగా పది నిమిషాల వ్యవధిలో పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయం అందిస్తారని నిర్వాహకులు స్పష్టం చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసు కుని అవగాహన పెంచుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో భద్రతాభావం కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు మరింత పెరగాలని పాల్గొన్న వారు అభి ప్రాయపడ్డారు.

## ఉత్సాహంగా ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు




**పలాస, డిసెంబరు 7(వార్త):** గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వ ర్యంలో నిర్వహించిన జాతీయ సేవా పథకంలో వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. జాతీయ సేవా పథకం ఈ 1నుంచి నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో భాగంగా వలంటీర్లు మొదటి రోజు నుంచే మొక్కలు నాటడం, ఎయిడ్స్‌పై ర్యాలీ అవగాహన సదస్సు, ఇంటింటి సర్వే, స్వచ్ఛభారత్, పరిసరాల పరిశుభ్రత గ్రామాలు పిచ్చి మొక్కలు, మురుగు తీసి బ్లీచింగ్ చల్లడం చేపట్టారన్నారు. మాదకద్రవ్యాలపై ర్యాలీ, అవగాహన సదస్సు, మెగా వైద్య శిబి రం, దేవాలయాల దర్శనం, సచివాలయం, అంగన్వాడీ ఆవరణ శుభ్రం చేసి పిల్లలతో ఆటలు ఆడిపించి బహుమతులు అందజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించార న్నారు. ఎన్‌ఎస్‌ఎస్ నాయకత్వ లక్షణాలు, సమాజ సేవ ఇప్పటి నుంచే అలవడుతా యన్నారు. అనంతరం వలంటీర్లు చరణ్,చాందిని, సుస్మిత, తులసి మాట్లాడుతూ అంద రితో కలిసి సరదాగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం తమకు చాలా ఆనం దంగా ఉందన్నారు. అనంతరం వలంటీర్లు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఎస్.రూప్‌సుందర్, ఇన్‌చార్జి ప్రిన్సి పాల్ కేశవరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళులు



**శ్రీకాకుళం, డిసెంబరు 7(వార్త):** పెద్ద బొందిలీపురం హరిజన వీధిలో అంబేద్కర్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఆ సంఘ ప్రెసిడెంట్ ఎం.వెంకట్రావు, కొత్తూరు సత్యనారాయణ, తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

# ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం




**కొత్తూరు, డిసెంబరు 7(వార్త):** రాష్ట్రంలో పేదలకు వైద్యం అందడం రోజురోజుకూ కష్టసాధ్యమవుతోందని, ఈ పరిస్థితికి కూటమి ప్రభుత్వం కారణమని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకం పేదలకు పెద్ద భరోసాగా నిలిచిందని ఆమె గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో నడిచిన ప్రస్తుత వైఎస్ఆర్సీపీ నేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఆ పథకం మరింత విస్తరించి, పేదవాడు వైద్యం కోసం అప్పుల బారిన పడకుండా చూడడంలో ప్రభుత్వం అత్యంత సంకల్పంతో వ్యవహరించిందని తెలిపారు. కానీ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకం నిర్వీర్యం కావడంతో పాటు, ఆసుపత్రులు సేవలు అందించడంలో వెను కంజ వేస్తున్నాయన్నారు. ఫలితంగా నిరుపేదలకు అత్యవసర వైద్య సేవలు కూడా ఆలస్యమవుతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పుడు రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పాలు చేయడానికి ప్రయత్నిస్తోందని, ఇది ప్రజారోగ్య వ్యవస్థ భవిష్యత్తుకు ప్రమాదకరమని శాంతి హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మళ్లీ పట ిష్ఠంగా అమలు చేసి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడా లని ఆమె డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను తక్షణం విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సేవా తత్పరుడు మురళికి ఘన సన్మానం



**మందస, డిసెంబరు 7(వార్త):** సేనాపతి మురళీ.. సేవాతత్పరుడని, సమాజహితమైన కార్యక్రమాలు చేస్తుంటారని పలువురు వక్తలు అన్నారు. కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్‌గా సేనాపతి దివ్య గురుతర బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి పంచాయతీని తనదైన శైలిలో అభివృద్ధి పథాన దివ్య నడిపిస్తున్నారు. ఆమె భర్త మురళీ కూడా ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. వృత్తిరీత్యా ఉద్యోగి అయినప్పటికీ, ప్రజల మేలు కోసం అహర్నిశలు ఆయన కృషి చేస్తున్నారు. ముకుందపురం గ్రామంలో ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రేకుల నిర్మాణం, విగ్రహం చుట్టూ ఫ్లోరింగ్, టైల్స్ ను వేసి, నూతనంగా తయారు చేయించారు. దీంతో గ్రామపెద్దలు, మహిళలు, స్థానికులు ఆయనను ఘనంగా సన్మా నించారు. సేనాపతి మురళీ సేవాతత్పరతతో పాటు ఆధ్యాత్మిక, సామా జిక కార్యక్రమాలను చేస్తున్నారన్నారు. పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ దివ్య, సర్పంచ్ ప్రతినిధిగా మురళీ పలు మంచి కార్యక్రమాలు చేపట్టార న్నారు. ప్రజలకు మంచి పనులు చేస్తున్న ఆ కుటుంబానికి వారు కృత జ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గవ్వ భీమారావు, స్థానిక పెద్దలు కోమటి తిరుపతి రావు, టి.గోపి, బి.వాసుదేవరావు, టి.చంద్రశేఖరం, బి.నారాయణ, బి.బాలకృష్ణ, బి.శంకరరావు, బి.రాజు లు, బి.తులసమ్మ, బి.రవి, బి.మాలతి, జోగేశ్వరమహాపాత్రో, కె.బాబూ రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని దర్శించిన హైకోర్టు జస్టిస్ రవినాథ్ దంపతులు




**జలుమూరు, డిసెంబరు 7(వార్త):** శ్రీముఖలింగంలో కొలువై ఉన్న ప్రసిద్ధ శ్రీముఖ లింగేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ రవినాథ్ తిలహరి సతీసమేతంగా ఆదివారం ఉదయం ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఆలయానికి విచ్చేసిన జస్టిస్ రవినాథ్ దంపతులకు ఆలయ ఈవో కొండలరావు, అర్చక బృందం సంప్రదాయ, మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ చరిత్ర, విశిష్టత, రోజువారీ నిర్వహణ విధానంపై అర్చకులు వారికి వివరించారు.

## ఉత్సాహంగా దేవాంగుల ఆత్మీయ వేడుక




**సోంపేట, డిసెంబరు 7(వార్త):** సోంపేటలో ఆదివారం దేవాంగుల సామాజిక వర్గా నికి చెందిన అనేక కుటుంబాలు వనభోజనాల పేరిట నిర్వహించిన ఆత్మీయ వేడుక ఉత్సాహంగా ఉల్లాసంగా కొనసాగింది. ప్రతి ఏటా కార్తీక మాసం తర్వాత నిర్వ హించుకునే ఈ ఆత్మీయ కలయిక ఈ ఏడాది కూడా దేవాంగ సామాజిక వర్గ పెద్దలు ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. పెద్దలు చిన్నలు యువత మహిళలు కుటుంబా లతో సహా హాజరై వారి అభిప్రాయాలను జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఆటలు, పాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయుడు కుమార్ మాస్టారు ఇటీవల పదవీ విరమణ చేయడంతో వారిరువురి దంపతులను ఘనంగా సత్కరించారు. దేవాంగ సామాజిక వర్గ ప్రముఖులు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, మాజీ సర్పంచ్ పొట్ల మోహన్ దాస్ గాంధీ, డాక్టర్ మంచు ప్రదీప్, డాక్టర్ ఎర్ర అనూష, డాక్టర్ ఎర్ర రాకేష్, ఉట్ల మీనకేతన్ రావు, ముప్పన ఈశ్వరరావు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

-ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

**మెళియాపుట్టి, డిసెంబరు 7(వార్త):** ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కరించే దశగా కృషి చేస్తానని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం మెళియాపుట్టి మండలంలోని చాపర జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో 41 ఉపాధ్యాయ జిల్లా కౌన్సిల్ ఐక్యవేదిక సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ పోరాటంతో దేన్నైనా సాధించగలమన్నారు.

ఈ సభకు ఒక రాజకీయ నాయకునిగా కంటే యూటీఎఫ్ అభిమానిగా వచ్చానన్నారు. విద్యా వ్యవస్థకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, విదాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనేక అంశాలపై మాట్లాడారు. యూటీఎఫ్ సంఘ ప్రతినిధులకు 50 వేల రూపాయలను ఎమ్మెల్యే గోవిందరావు విరాళంగా అందజేశారు.



కార్యక్రమంలో యూటీఎఫ్ సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక



**శ్రీకాకుళం, డిసెంబర్7(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ లో సోమవారం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ఉత్సాహంగా.. నవోదయ నమూనా పరీక్ష

* ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పరీక్ష * జిల్లా వ్యాప్తంగా 917 మంది హాజరు * ప్రధాన పరీక్షకు తీసిపోని స్థాయిలో ప్రశ్నాపత్ర సరళి, నిర్వహణ తీరంటూ ప్రశంశలు

శ్రీకాకుళం, డిసెంబర్ 7(వార్త): ఎర్రన్న విద్యా సంకల్పం పేరుతో శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇప్పటికే ఉపాధి, నైపుణ్యాభివృద్ధి విషయంలో కీలక కార్యక్రమాలను ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా నిర్వహించగా.. జిల్లాలోని నిరుద్యోగులకు అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. తాజాగా ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా నవోదయ పాఠశాల నమూనా పరీక్ష జిల్లా వ్యాప్తంగా జరుగగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోంది. మరి కొద్ది రోజుల్లో జవహర్ నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్ష జరగనుంది. ఈ పాఠశాలలో ప్రవేశానికి వేలాదిమంది అయిదవ తరగతి విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. అయితే ఇలాంటి పోటీ పరీక్షను మొదటి సారి ఎదుర్కొంటున్న విద్యార్థులలో ఆ భయాన్ని పోగొట్టాలని, ముందుగానే వారిని పరీక్షకు సిద్ధం చేసే దిశగా స్థైర్యాన్ని అందివ్వాలనే ఉద్దేశంతో ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా నమూనా పరీక్షను ఆదివారం శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఇందుకోసం ముందుగానే విద్యార్థుల నుండి రిజిస్ట్రేషన్లు ఆహ్వానించింది. రిజిస్టర్ అయి వెబ్ సైట్ నుండి హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు 1129 మందికి పైగా విద్యార్థులలో 917మంది విద్యార్థులు ఆదివారం నాటి నమూనా పరీక్షకు హాజరయ్యారు. ప్రధాన పరీక్ష





తరహాలోనే ఉదయం 11 ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1:30కు ముగిసింది. ఇందుకోసం జిల్లాలోని సోంపేట, పలాస, టెక్కలి, శ్రీకాకుళం, పాతపట్నం ప్రాంతాలలో పరిక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో శ్రీకాకుళం నుండి 233, పలాస నుండి 189, పాతపట్నం నుండి 92, టెక్కలి నుండి 145, సోంపేట నుండి 258 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలిసారి ఓఎంఆర్ విధానంను ఎదుర్కొంటున్న విద్యార్థులు కొన్ని పొరపాట్లు చెయ్యగా.. వాటిని విద్యార్థులకు తెలియజేసి సరిచేశారు. ప్రధాన పరీక్షకు తీసిపోని స్థాయిలో నమూనా పరీక్షను జిల్లా వ్యాప్తంగా నిర్వహించగా.. ప్రశాంతంగా పరీక్ష కొనసాగింది. ఇందుకు సంబంధించిన ఫలితాలను కూడా త్వరలోనే విడుదల చేస్తామని, ఫలితాలను వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచడంతో పాటు విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్ కు మెసేజ్ ను పంపడం జరుగుతుందని నిర్వాహకులు స్పష్టం చేశారు. తొలిసారి పోటీ పరీక్షను ఎదుర్కొంటున్న విద్యార్థులలో ఆ భయాన్ని పోగొట్టే దిశగా అద్భుతమైన కార్యక్రమాన్ని రూపొందించిన కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, నిర్వాహకులకు ఈ సందర్భంగా, విద్యార్థులు వారి తల్లితండ్రులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# బీసీ సంక్షేమానికి భాగస్వామ్యమే కీలకం

* ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ
* శ్రీకాకుళంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, కుల సంఘాల ప్రతినిధులతో సమీక్ష * పలు సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చిన డైరెక్టర్లు

**శ్రీకాకుళం, డిసెంబర్ 7(వార్త):** వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యక్రమాల పూర్తి విజయానికి వారి భాగస్వామ్యమే అత్యంత కీలకమని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, కుల సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో విజయవంతమైన 'ఆదరణ 1, 2' కార్యక్రమాలకు కొనసాగింపుగా 'ఆదరణ 3' కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారని, ఇందులో భాగంగా కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలు, సూచనలు తీసుకొని గతంలో కంటే మెరుగైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారని తెలిపారు. దానికి అనుగుణంగానే జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తున్నామని సత్యనారాయణ వివరించారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు 550 వృత్తిపరమైన పరికరాలను గుర్తించడం జరిగిందని, వృత్తిపరంగా ఆధునిక పరికరాలను, నైపుణ్యాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీసీల జనాభాను అనుసరించి పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. బీసీ ప్రొటెక్షన్ యాక్ట్ ముసాయిదా తయారీ వెనుకబడిన తరగతుల రక్షణ కోసం బీసీ ప్రొటెక్షన్ యాక్ట్ ముసాయిదా తయారవుతోందని సత్యనారాయణ వెల్లడించారు. బీసీలకు విద్యా, సామాజిక, ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ ముసాయిదా ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పలు కుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలు, అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గారావు ఆధునిక ధోబీ ఘాట్ల నిర్మాణాన్ని కోరగా, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వర్ రావు యాదవులకు బంజరు భూములు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కమ్మరి, కలుస్తులకు టార్పాలిన్లు సరఫరా చేయాలని, విశ్వబ్రాహ్మణులకు ఇంటి దగ్గర కలపకు కొంతవరకు అనుమతిస్తే అధికారుల వేధింపులు తగ్గుతాయని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. పలు కుల సంఘాల ప్రతినిధులు బీసీలకు పింఛన్ వయస్సును 50 సంవత్సరాలకు తగ్గించాలని అభ్యర్థించారు. నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆసుపత్రులు, దేవాలయాల్లో ప్రత్యేక పోస్టులు, బ్యూటీ పార్లర్, స్పా ఏర్పాటుకు రుణాలు ఇవ్వాలని కోరగా, పొందర కూరాకుల కులాల వారు మోపెడ్స్, బోర్ వెల్స్, రైతు బజార్లలో షాపులు ఏర్పాటు చేసేందుకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అవసరాలకు తగిన పరికరాలు అందజేయాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడు మాట్లాడుతూ అన్నారు. స్థానిక అవసరాలకు పనికొచ్చే వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను బీసీలకు అందజేయాలని కోరారు. కుల వృత్తుల యూనిట్లకు విద్యుత్ రాయితీ కల్పించాలి అని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎస్.వి. లక్ష్మణమూర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి అనురాధ, జిల్లా ప్రత్యేకాధికారి మారెళ్ళ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546